# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-12-2025                    సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ 'వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్' (VB-G-RAM-G) బిల్లు-2025కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు.

❖ సానుకూల, సమ్మిళిత సమాజ నిర్మాణంలో ధ్యానం శక్తివంతమైన సాధనమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అభివర్ణించారు.

❖ అసోంలో 10 వేల 601 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఎరువుల కర్మాగారానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు శంకుస్థాపన చేశారు.

❖ నకిలీ ఎరువులు, పురుగుమందుల అక్రమాలను అరికట్టేందుకు తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో పటిష్ఠమైన బిల్లును ప్రవేశపెట్టనున్నామని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.

❖ తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఈరోజు దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉండటంతో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

`వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్` (VB-G-RAM-G) బిల్లు-2025కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఇటీవలి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఉభయ సభలు ఆమోదించిన ఈ బిల్లు, రాష్ట్రపతి సంతకంతో ఇప్పుడు చట్టరూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో చట్టబద్ధంగా కల్పించే కనీస ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. సుమారు రెండు దశాబ్దాలుగా అమలులో ఉన్న `మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం` (MGNREGA)- 2005 స్థానంలో ఈ `వీబీ జీ-రామ్ జీ' చట్టం అమల్లోకి వస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. గ్రామీణ ఉపాధి విధానంలో ఇదొక చారిత్రక మైలురాయి అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అభివర్ణించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సానుకూల, సమ్మిళిత సమాజ నిర్మాణంలో ధ్యానం శక్తివంతమైన సాధనమని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అభివర్ణించారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో ఈరోజు నిర్వహించిన రెండవ `ప్రపంచ ధ్యాన దినోత్సవ` వేడుకల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సామరస్యం, ఆధ్యాత్మికతను వ్యాప్తి చేస్తున్న `హార్ట్ ఫుల్‌నెస్` సంస్థ కృషిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని దైనందిన జీవితంలో అంతర్భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘర్షణలతో సతమతమవుతున్న నేటి ప్రపంచానికి శాంతి, కరుణ, ఐక్యత వంటి విలువలు గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని సి.పి. రాధాకృష్ణన్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

అసోం పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. దిబ్రూగఢ్ జిల్లా నామ్‌రూప్‌లో 10 వేల 601 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించనున్న ఎరువుల కర్మాగారానికి ఈరోజు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి, వ్యవసాయ రంగానికి ఈ ప్రాజెక్టు వెన్నెముకగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన కర్మాగారం ద్వారా ఏటా 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి అవుతుందని ప్రధానమంత్రి వెల్లడించారు. ఇది అసోం అవసరాలనే కాకుండా పొరుగు రాష్ట్రాల డిమాండ్‌ను కూడా తీరుస్తుందన్నారు. దీని వలన స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఈ ప్రాంతంలో పారిశ్రామిక విప్లవానికి ఇది నాంది పలుకుతుందని పేర్కొన్నారు. 2014లో దేశంలో యూరియా ఉత్పత్తి 225 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండగా.. గత పదేళ్ల కృషి ఫలితంగా అది ఇప్పుడు 306 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని నరేంద్ర మోదీ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

“పంచాయతీల విస్తరణ షెడ్యూల్డ్ ప్రాంతాల చట్టం 1996” `పెసా` ఉత్సవాలు విశాఖపట్నంలో జరగనున్నాయి. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయి. చట్టం అమలు తీరును పర్యవేక్షించేందుకు, సమాచారాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యేకంగా `పెసా పోర్టల్`ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించనున్నారు. రాష్ట్రాల వారీగా ఈ చట్టం ఏ మేరకు అమలవుతోందో అంచనా వేసేందుకు `పెసా సూచికలను` కూడా విడుదల చేయనున్నారు.

విరామం

==========================

దేశ వ్యాప్తంగా నకిలీ ఎరువులు, పురుగు మందుల అక్రమాలను అరికట్టేందుకు తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో పటిష్ఠమైన బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. న్యూఢిల్లీలో 'కిసాన్ ట్రస్ట్' ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. తప్పుదోవ పట్టించే పేరులతో అనధికారిక బయో-స్టిమ్యులెంట్లను, కల్తీ ఎరువులను విక్రయించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇటీవల తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' చట్టం ద్వారా ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

==========================

దేశంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పన, జీవనోపాధికి విద్యుత్ వాహన (ఈవీ) రంగం ఒక శక్తివంతమైన చోదక శక్తిలా మారుతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన `ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఎక్స్ పో`ను ఆయన ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవీ రంగం భవిష్యత్తులో దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చబోతోందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఆరోగ్య స్పృహ పెరుగుతోందని, 'సండే ఆన్ సైకిల్' ప్రజల అలవాటుగా, ఒక సంస్కృతిగా మారిపోయిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ఈ రోజుతో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజల్లో ఆరోగ్యాన్ని పెంపొందించడం, ఊబకాయం తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని బాంగ్లాదేశ్ హైకమీషన్ వెలుపల నిరసనకారులు భద్రతాపరమైన ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ వస్తున్న వార్తలను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (MEA) తీవ్రంగా ఖండించింది. అలాంటి సంఘటనలు జరగలేదని స్పష్టతనిచ్చింది. బాంగ్లాదేశ్‌లోని మైమెన్సింగ్‌లో దీపూ చంద్రదాస్ హత్యను నిరసిస్తూ.. సుమారు 20 నుంచి 25 మంది హైకమీషన్ ఎదుట నిరసన తెలిపారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అక్కడ పహారా కాస్తున్న పోలీసులు నిమిషాల వ్యవధిలోనే వారిని చెదరగొట్టారని, అక్కడ ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోలేదని వెల్లడించింది. ఈ ఘటనపై బాంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రసార మాధ్యమాలు తప్పుడు ప్రచారానికి తెరలేపాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఈరోజు అతి దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉండటంతో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది. దీంతో పాటు ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఈశాన్య భారత్‌లోని పలు ప్రాంతాల్లో రేపటి వరకు పొగమంచు ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణతో పాటు కర్ణాటక, మధ్య మహారాష్ట్ర, బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో తీవ్ర చలిగాలులు (Cold Wave) వీస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దుబాయ్‌లో ఈరోజు జరిగిన అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు, భారత్‌పై 191 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. 348 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. 26.2 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌటైంది.

అదే విధంగా భారత్ శ్రీలంక మహిళల క్రికెట్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో భాగంగా విశాఖపట్టణం వేదికగా తొలి మ్యాచ్ జరుగుతోంది. విశాఖలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంక 18 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 104 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =